తలుపు

సి.మధు

ఆ తలుపుకి చీకటంటే చాలా భయంగా వుంటోంది. చీకట్లో దానికి భయమేసే సంఘటనలు చాలా జరిగేయి భయంగా వింతగా, ఏవో తెలియని అడవుల్లో ఎవరో కనబడని ఆశ్వికులు గుర్రాలమీద అస్పష్టంగా పోతున్నట్లు ఆ సంఘటన లన్నీ మసక చీకటిలో దాని కళ్ళముందు మళ్ళీ జరుగుతున్నట్లే వుంటాయి చీకటి పడినప్పుడల్లా దానికి దిగులుగా ఎవరో వెక్కివెక్కి ఏడుస్తున్నట్లు వినిపిస్తుంది. మూగ ప్రేమికుడెవరో, గాలికీ, ఆకాశానికీ తన ప్రేమని అర్థంకాని భాషలో అరుస్తూ చెప్తున్నట్లు అనిపిస్తుంది తరుణ వయసులో మరణవేదన పడే నిర్భాగ్యుడి రూపు భయంకరంగా ప్రత్యక్షమవుతుంది.

ఆ తలుపు చాలా పాతది విశాల ప్రపంచానికీ నాలుగుగోడల్లోని దుమ్ము పట్టిన ఇరుకుగదికీ మధ్యన మునలితేదాంతిలాగ మాటలు రాని ప్రేక్షకుడిలాగా అడ్డంగా నిలబడి వుంటుంది దాని వెనకగా గోడలో దొలిచిన చిన్న గుహలా వుంటుంది ఆ గది. ఒకే ఒక కిటికీ తప్ప దాంట్లోకి గాలీ వెలుతురూ వచ్చే మార్గమే లేదు ఆ గదిలో చాలామంది వుండి వెళ్ళిపోయేరు చాలామంది చాలా బాధలు అనుభవించేరు. కష్టాల్లో కన్నీళ్ళు పెట్టుకున్నారు సుఖాల్లో గది తప్పులు చూస్తో పడుకొని సంతోషంగా నవ్వుకొన్నారు తరువాత స్త్రలో బాటసారులలాగానే ఖాళీగది మిగిల్చి వెళ్ళిపోయేరు.

అటూ ఇటూ గంభీరంగా నిలబడి వున్న రెండు పెద్దింటిగోడలు ఆ సన్నటి సందుని సృష్టించేయి. ఆ సందులో సాధారణంగా జనసంచారం వుండదు. పైగా రెండు తలుపులుండాల్సిన ఆ గది ద్వారానికి ఒకేఒక్క పెద్ద చెక్కతలుపు వుంది... అందుకని అది ఆ సందులో ఒంటరితనం అనుభవిస్తోంది. రోజులు గడిచి సంవత్సరాలయినందుకు చిహ్నంగా దానిమీద బీట్లు పడిపోయేయి. నల్లగా మాసికలు పడ్డాయి. ఇంకా నల్లగా తుప్పపట్టిన మేకులు బయటికి కనిపిస్తున్నాయి. ఆ గదిలో నివసించినవాళ్ళు ఎప్పుడో ఎన్నాళ్ళకిందటో అలంకరణార్థం ఆ తలుపుని బాగా ఉపయోగించుకున్నారు. పాతకాలపు చక్రవర్తుల అర్థంకాని శాసనాల్లాగా వాళ్ళ ఆ తలుపులమీద అతికించుకున్న కాగితాలు అలాగే నిలిచిపోయాయి. మధ్యగా ఓ గ్రటి పేపరుమీద ఆ వూళ్ళో గయోపాఖ్యానం నాటకం వేసే తేదీ, నటుల పేర్లు రాసి వున్నాయి. కిరీటం పెట్టుకున్న మనుషుల బొమ్మలు రెండు ఆ కాగితంలోంచి తొంగి చూస్తున్నాయి. దానిపక్కని ఏవో వారపత్రిక లోంచి చించిన బొమ్మ వుంది. ఏదో సినిమాలో దృశ్యం అది. ఆ బొమ్మలో ఇద్దరు వ్యక్తులు ఆప్తమిత్రుల్లా నిలబడి వున్నారు. వాళ్ళిద్దరి కళ్ళల్లో స్నేహం మెరిసిపోతూ ంది...

దాని జీవితం సగం చీకట్లో సగం వెలుతురులో గడిచిపోయినా ఆ తలుపు నిర్లిప్తంగా వుండిపోయింది. కాని హఠాత్తుగా దానికి చివరిరోజుల్లో చీకటంటే భయం పట్టుకుంది ఖాళీగదీ, బూజుపట్టి భయంగా చూసే గోడలూ, మ

గని మురికిసందూ చీకటి పడగానే దానికి వందలకొద్దీ జ్ఞాపకాలూ తెస్తున్నాయి. జ్ఞాపకాలు వికృతంగా నృత్యం చేస్తుంటే తలుపు గాలికి దడదడా కొట్టుకుంటోంది.

నిర్లిప్తంగా వుండే ఈ నాలుగు గోడల మధ్య చాలా చీకటిరాత్రుల వెనక ఇద్దరబ్బాయిలు బ్రతికేరు వాళ్ళకి ఆ సందూ, గదీ వేరే ప్రపంచంలా వుండేది. గోడలూ తలుపూ నిరాశావాదుల్లా చూస్తుంటే వాళ్ళిద్దరూ పకపకా నవ్వుకున్నారు కలసి కలలు కన్నారు ఆశావాదుల్లా జీవించారు. వాళ్ళిద్దరిలో ఓ అబ్బాయికి గిరజాల జుట్టుండేది. పెద్ద ముక్కూ అందమైన కళ్ళూ వుండేవి. తను పనిచేసే ఫాక్టరీలో కరగి గట్టిపడిన ఉక్కులాంటి కండలుండేవి అతనికి సినిమాలంటే ప్రాణంగా వుండేది. 'నాగేస్రావు'ంటే మరీ ప్రాణంగా వుండేది. ఇంకో అతను పక్కపాపిడితీసి దువ్వేవాడు. అతని కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా వుండేవి. ఏదో సినిమాహాల్లో గేట్‌కీపర్‌గా పని చేసేవాడు. అయినా అతని జీవితంలో నాటకంవేషాలు వెయ్యడంకంటె వున్నతమైన ఆశయం ఏమీ వుండేదికాదు. అతను సన్నగా పొడుగ్గా బలిష్ఠుడు నాశనంచేసే బలహీనుడులా దిగులుగా వుండేవాడు.

వాళ్ళిద్దరూ స్నేహితులు. గదిమధ్యని చింకి చాప మీద కూర్చొని బిగ్గరగా

తలుపు

కబుర్లు చెప్పుకున్నారు. పక్క పక్కనే పడుకుని ఇంకా బిగ్గరగా అర్థం లేకుండా నవ్వుకుంటూ గడిపేరు. సమాధానం తెలియని ప్రశ్నలకి వాళ్ళు బాధపడలేదు. వాళ్ళు జీవితాన్ని ఆ చిన్న గదిలోంచే చూశారు. అంత చిన్నదిగా కనబడింది వాళ్ళకి.

ఒకరోజు గిరజాల జుట్టబ్బాయి ఓ వారపత్రిక కొనుక్కొచ్చేడు. శ్రద్ధంగా దాంట్లోంచి ఓ బొమ్మ కత్తిరించి తీసి ఆ తలుపుమీద అంటించేడు—భాగ్యవంతుడి ఖరీదయిన గదిలో అర్థంకాని అందమైన రంగులబొమ్మ అలంకరించినట్టు. నాలుగు మూలలా కొంచెం కొంచెం బూజు పట్టిన ఆ తలుపుమీద ఆ బొమ్మ గట్టిగా అతుక్కుపోయింది విడదీయలేని మిత్రుడిలాగా.

అప్పుడు గిరజాల జుట్టబ్బాయి స్నేహితుడి భుజంమీద చేయేసి దగ్గరకు తీసుకుని 'ఒరే రాజా మనిద్దరం ప్రాణమిత్రులంరా!' అన్నాడు సాధ్యమైనంత గంభీరంగా.

'అచ్చు రాత్రి సినిమాలో జగ్గయ్యన్నట్టే అన్నావురా' అని ఆశ్చర్యపోయేడు రాజా. బహుశా ఆ రోజునుంచీ వాళ్ళిద్దరూ ప్రాణమిత్రులయ్యారు. వాళ్ళ



డ్యూటీలు కలవకపోయినా ఆదివారాలప్పుడూ శలవలప్పుడూ వాళ్ళిద్దరూ కలసి వూరంతా తిరిగేవాళ్ళు. ఇద్దరూ కలిసి డ్రామాలకెళ్ళేరు. సినిమాలు చూశారు. అద్దె సైకిళ్ళమీద వెళ్ళి సరదాగా సముద్రస్నానం చేశారు. బ్రతుకంతా సముద్రం నీటిమీద ప్రతిఫలించే లేత ఎండలాంటిదే ననుకున్నారు.

ఇది జ్ఞాపకంవస్తే ఆతలుపుకి కొత్త జీవితం వచ్చినట్టు వుంటుంది. లోపల ఎవరో మాట్లాడకుంటున్న చప్పుడూ నివసిస్తున్నారనే అనుభూతీ ఎంతో హాయి నిచ్చేదానికి ఆ అనుభూతిని దూరం చేసిన దృశ్యాలు అది మరచిపోలేక పోతోంది. కాటికి కాళ్ళు జాచుకున్న వృద్ధుడికి హఠాత్తుగా పిచ్చెక్కినట్టు జ్ఞాపకాల విష వలయంలో చిక్కుకుపోయిన తలుపు కంగారు పడిపోతూంది.

ఓ అందమైన సాయంకాలం డ్యూటీ నుంచి తిరిగివచ్చిన గిరిజాల జుట్టబ్బాయీ, డ్యూటీ కెళ్ళబోయే రాజా మాట్లాడుకుంటున్నారు. గిరిజాల అబ్బాయి పేరు ప్రసాదు...వీధి పంపుదగ్గర స్నానం చేసివచ్చి బట్టలు వేసుకుంటూన్న ప్రసాదు పేంటు జేబులోంచి ఓ ఫోటో తీసేడు. రాజా అది చూసి అర్థం కానట్టు మొహంపెడితే, సినిమా హీరోలాగా, ఓచేయి గుండెమీద పెట్టుకుని నెమ్మదిగా, 'నీ కిన్నాళ్ళూ చెప్పనందుకు క్షమించు, రాజా. ఈ అమ్మాయీ నేనూ ప్రేమించుకున్నాం. నా హృదయ దేవత అయిపోయింది ఈ అమ్మాయి...' అన్నాడు.

మొదట రాజా కంగారు పడ్డాడు 'అసలీ అమ్మాయి ఎవరు?' అని అడిగేడు. ఎవరో తెలుసుకున్నాక భయపడ్డాడు.

'నిజమా, వేళాకోళమా...అసలు నీకెలా పరిచయమయింది?'

రాత్రిపూట ఒంటరిగా నడచిపోయే బాటసారి దారికడ్డంగా చీకట్లో వల్లటి ఆకారం హఠాత్తుగా మాట్లాడకుండా నిల్చుంటే; ఆమనిషి భయంగా మనిషేనేమో అనే ఆశతో 'ఎవరు ...ఎవరు నువ్వు?' అని అడిగినట్టుగా ప్రశ్నలు కురిపించేడు.

ప్రసాదు నేరస్థుడిలా తలవంచుకున్నాడు అతను చేసిన తప్పులు చాలా

6—6—6!

వున్నాయి ఇప్పుడు. రాజాకి కోపం వచ్చింది. 'ఛ నాకు తెలియకుండా ఎలాంటి పని చేశావు...' అని విసుక్కున్నాడు కష్టాల సుడిగుండాల్లో బతకటానికి దారిలేక తిరిగి కూడు గుడ్డకోసం తనువమ్ముకునేస్థితికి వచ్చినదీనురాలిని ప్రెసాదు ప్రేమిస్తున్నాడు! అమర ప్రేమికుడులా త్యాగమూర్తిలా వుద్ధరిస్తానంటున్నాడు. అసలు అలాంటి చోట్లకి ఎందుకు వెళ్ళాలి. వెళ్ళినవాడు అమ్మకం సరుకుమీద అంతులేని ప్రేమ ఎందుకు చూపించాలి.

రాజాకి కంపెనీలగురించి వాటి ఆర్గనైజేషను గురించి తెలుసు. ఆ అమ్మాయి తెలియకపోయినా ఆ అమ్మాయి పరిస్థితుల గురించి తెలుసు. ఆ పిల్ల పద్మవ్యూహంలో ఆమె చుట్టూవున్న బురద—బురదలో చిందరవందరగా పడున్న ముళ్ళూ దాక్కున్న విషసర్పాల గురించికూడా కొంచెం తెలుసు. అందుకని ఆ పద్మవ్యూహాలగురించీ వాటి వెనకవున్న పెద్ద చేతులగురించీ, పెద్ద చేతుల్లోని దుష్టశక్తులగురించీ భయంగా వర్ణించి చెప్పేడు ప్రెసాదుకి — చిన్న పిల్లాడికి రాక్షసులగురించి చెప్పినట్లు.

ప్రెసాదుకప్పుడు ప్రేమించానని భయం వేసింది. 'ఆ అమ్మాయి పాపం నాతో వచ్చేస్తానంది రమ్మంటే నాకోసంఏదైనా చేస్తానంది. అక్కడ ఆమె చాలా బాధపడిపోతోంది. ఆ బాధ చూడలేను రాజా. ఈ జాలీ భరించలేను. ఏదో ఒకటి చేసేయాలి...' అని గొణుగుతూ మాటాడేడు. ప్రేమించడం, ప్రేమించిన ప్రియురాలు తనతో వచ్చేస్తాననడం తల్చుకుంటే అతనికి వళ్ళు పులకించింది. దానివెనక నీడల్లాంటి సమస్యలు కనబడితే వళ్ళు జలదరించింది.

'నన్నొదిలి వెళ్ళిపోవడానికి ప్లానుకూడా వేసి రడీగా వున్నావన్నమాట' అన్నాడు రాజా బాధగా. సాయంత్రపు చీకట్లు ముసురుతూంటే వాళ్ళిద్దరూ నిశ్శబ్దంగా ఆలోచించేరు. ఆ క్షణంలో వాళ్ళకి జీవితమంతా పెద్దసమస్యలా కనబడింది.

కాసేపయింతర్వాత హఠాత్తుగా ఏదో ఆవేశం వచ్చినట్లు రాజా గబగబా మళ్ళీ ఏదో చెప్పబోయేడు. 'డేంజ'రన్నాడు. 'నామాట విను' అన్నాడు. నిస్సహాయుడిలాగా విసుక్కున్నాడు.

తలుపు

అతనిమాటలు వింటూంటే ప్రెసాదుకి తనొక్కడే ఏదో పాతపడవలో దూరంగా వెళ్ళిపోతున్నట్లూ, నదిగట్టున నిల్చొని ఆ అమ్మాయి ఏడుస్తూ పిల్చినట్లూ అనిపించింది. రహస్యంగా చీకట్లో ఆ అమ్మాయి నీతో వచ్చేస్తాను అని చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చాయి. పాలరాతిమీద గంట్లులాగా తెల్లటి మొహంమీద కనబడీ కనబడని మచ్చలూ, జాలిగా చూచిన కళ్ళూ సన్నటి మెత్తటి చేతులూ కూడా గుర్తుకొచ్చేయి.

అందుకని ప్రెసాదు గుండెనిబ్బరం తెచ్చుకొని ప్రాణమిత్రుడి మాటలు లెక్క చేయకుండా చెప్పేడు. 'ఏమైనా సరే నేను ఆ అమ్మాయితో వెళ్ళిపోతాను. ఇన్ని ఆశలు పెట్టి మోసం చేయలేను జాడ దొరక్కపోతే 'పోతే పోయిందిలే' అని వాళ్ళే వూరుకొంటారు. తరవాత ఎక్కడైనా రిక్షాలాగైనా బతకొచ్చు...'

రాజా మాట్లాడలేదు. 'సరే...నన్నొదిలి దూరంగా వెళ్ళిపోతావన్నమాట ...వెళ్ళిపో' అనుకున్నాడు. ఆ తలుపూ గోడలూ వాళ్ళిద్దరివంక రివాజు ప్రకారం ముభావంగా చూసేయి.

* * *

తరువాత దృశ్యం ఆ తలుపు జ్ఞాపకం చేసుకున్నప్పుడు అమాయకుడు గడచిపోయిన పీడకలని తల్చుకుంటున్నట్లుగా ఆలోచిస్తుంది. ఆ రోజు ఆదివారం. రెండో ఆట సినిమాకెళ్ళి తిరిగివస్తున్న స్నేహితులిద్దరూ వాళ్ళ ప్రపంచపు సరిహద్దు అయిన సందుమొగలోకి అడుగుపెట్టేరు.

అడుగుపెట్టేంతర్వాత వాళ్ళ గుండెలు ఓ క్షణం ఆగి మళ్ళీ కొట్టుకోవాల్సిన అవసరం వచ్చింది. వీధి దీపం గుడ్డివెలుతురులో నాలుగు బలిష్టమైన నీడలు కనబడ్డాయి. అవి వీళ్ళని చూడగానే కదిలేయి. పొట్టినిక్కరు మనుషులు యమకింకరుల్లా కనిపించేరు వాళ్ళ చేతుల్లో ఇనుప చువ్వలు మృత్యువు రూపాల్లో మెరిసేయి. వాళ్ళనుంచి వచ్చే మత్తెక్కించే ముతకవాసన చిరకాలంనుంచి ఆ సందులోవున్న మురికి కాలవ కంపుతో మిళితమై వాళ్ళని చుట్టేసింది.

తరవాత పక్కనున్న చెట్టుమీద పిగుడ్లగూబా అరవలేదు ఘోరం జరగబోతోందని నక్కలు కూయలేదు. చీకటి చీకటిలా వుండిపోయింది తాళం వేసిన తలుపు సాక్షిలా చూస్తోంది. వీధి దీపం బల్బు కర్తవ్యం నిర్వహిస్తో వెలుగుతోంది. దీపం స్తంభానికి ఆనుకున్న గిరజాలజుట్టు ఆకారం విరామం లేకుండా అంతరిక్షంలోంచి వచ్చే దెబ్బల్ని రుచిచూస్తోంది. ఇనుపకడ్డీలు విలయ విహారం చేస్తున్నాయి కరగిగట్టిపడిన వుక్కుకండలు మళ్ళీ కరిగి పోతున్నాయి. కరిగిపోయి భయంకరంగా ఎర్రగా వాస్తున్నాయి. రాజా శరీరం మరోపక్క కుప్పగా కూలిపోయింది. కూలిపోయిన వీపులోంచి నల్లటి నెత్తురు అమాయకంగా కారిపోతోంది. భౌతిక శరీరాల మూలుగులు దెబ్బల శబ్దాల్లో కలిసిపోయేయి.

ఆ క్షణాల్లో వాళ్ళిద్దరికీ హఠాత్తుగా వెయ్యి ఏనుగులు వాళ్ళని ముక్కలు ముక్కలుగా చేసి తొక్కుతోన్నట్లు, శరీరం మిషను చక్రాల్లో పడి నలిగిపోతున్నట్లూ అప్పుడు పిశాచాలు తమని చూసి పరిహసిస్తున్నట్లూ అనిపించింది. చెవులనిండా మోతలు నవ్వులు అరుపులు వినిపించేయి. కళ్ళలో రంగులూ, చీకట్లూ మెరుపులూ గిరగిరా తిరిగేయి. వంటినిండా నెప్పులూ, ఎముకలు విరిగే చప్పుడూ అలసిపోయిన గుండె ఆగిపోవడం తెలిసింది.

అప్పుడు ఒక్కసారి అంతా నిశ్శబ్దం అయిపోయింది. చెవులలో చప్పుళ్ళు వినబడటం ఆగిపోయింది. ఎముకలు విరగటం మానేశాయి. వీధిదీపం వెలుగుతూనే వుంది. నక్షత్రాలు నాలుగైదు జాలిగా మెరుస్తున్నాయి. మురికినీళ్ళలో మునిగి పడున్న రాజా పైకి లేచేడు. లేచి నిల్చోలేక తూలి పడబోయాడు. తూట్లుపడిన శరీరంలో మిగిలిన ఏ శక్తో అతన్ని నడిపించింది. ఆ శక్తితోనే ప్రాణమిత్రుణ్ణికూడా గదిలోకి చేరేశాడు. సగం తెరుచుకున్న తలుపు తెల్లబోయి చూస్తుండగానే చింకిచాపమీద పడి బాధల స్పృహ కోల్పోయేడు.

అప్పట్నుంచి అంతా గందరగోళం... బూట్ల చప్పుళ్ళూ కేకలూ... గోల! రాజాకి ఎవరో మందు రాస్తున్నట్లనిపించింది. ఎవరో ఏదో అడుగుతున్నారు. అంతా మసక మసకగా వుంది. రాజాకి

భయం వేసింది. కాని అతనికళ్ళకి ఎర్ర టోపీలూ మూడుతలల సింహమూ కనిపించేయి బలహీనంగా 'పోలీసోళ్ళు !' అనుకున్నాడు. అతన్ని గవర్నమెంటు డాక్టరు పరీక్షించి చూసేడు. ప్రెసాదుని ఆయనే చూసి హత్య అని చెప్తున్నారు. రాజా మళ్ళీ 'హత్య ... హత్య' అనుకున్నాడు 'ఆళ్ళు ప్రెసాదుగాణ్ణి చంపేశారు...'

అతనికి ఆలోచించే శక్తి బతుకుతున్నాననే అనుభూతీ గాలి చల్లదనం ఎండ వేడిమీ తెలియటానికి పదిరోజులు పట్టింది. ఆ రోజులన్నీ తెల్లగోడలూ తెల్లబట్టల నర్సులనీ చూస్తూ గడిపేడు. ఇన్స్పెక్టరు ఓసారివచ్చి నయమైనాక కోర్టుకు రావాలని చెప్పేడు. 'కోర్టు...జన్మలో కోర్టు చూడలేదు'. అనుకున్నాడు. తరువాత ప్రెసాదు జ్ఞాపకం వస్తూండేవాడు. 'చెప్తే వినకుండా ఇంతకి లెచ్చేడు. అసలు ఈ గొడవ ఆళ్ళందరికీ ఎలా తెలిసిపోయిందో' అనుకునేవాడు చాలాసార్లు.

దెబ్బలు నయమయినాక హాస్పటల్‌నుంచి ఇంక వెళ్ళవచ్చు, అని చెప్పేరు కుంటుకుంటూ గదికి బయలుదేరేడు. కొన్ని యుగాలైంది ఆ గదిచూసి. సినిమాహాలూ వుద్యోగం—బట్టతల మేనేజరూ జ్ఞాపకం వచ్చేరు పదిరోజులూ పనిలోకి వెళ్ళలేదు ఒకవేళ ఈ గొడవ చూసి పనిలోంచి తీసేస్తే...రిక్షాకూడా లాగలేడతను. ఇంక ఏం చేయాల్సి వుంటుందో—అనిపించింది. గదిదగ్గర ఆగి తలుపు తీసేడు. ఎదురుగుండా చిరిగిపోయిన చాప కన్పించింది. ఇదే చాపమీద ఆరోజు రాత్రంతా ప్రెసాదుగాడి శవం వుబ్బిపోయి పడివుండి వుంటుంది. అతనికి వొళ్ళు జలదరించింది ఆలోచిస్తూ నిల్చుండిపోయేడు. వెనక చిన్నశబ్దం ఏదో అయింది. వులిక్కిపడి వెనక్కి తిరిగి చూసేడు.

ఐదుగురు మనుషులు. ముగ్గురుమాత్రం ఖాకి నిక్కర్లు వేసుకుని రౌడీల్లా వున్నారు. వాళ్ళకి నాయకుడులా వున్నాయన అచ్చం తెలుగు సినిమాలో విలనులానే వున్నాడు. ముందుకి రెండడుగులు వేసి 'రాజారావ్' అంటున్నాడు. ఆయనముఖం ఎర్రగా వుంది. కళ్ళు క్రూరంగా ధైర్యంగా చూస్తున్నాయి. ఆయన కట్టుకున్నది మల్లెపూవులాంటి తెల్లటిపంచె వేసుకున్నది గ్లాస్కో లాల్చీ. ఆయన మెడలో బంగారు గొలుసుంది. ఆయన శరీరం లావెక్కి వుంది. జుట్టు నెరిసుంది. గొంతు బొంగురుగా ఆజ్ఞాపిస్తున్నట్టుంది ఆయన వెనక నల్లటి లావుగా వున్న ఇంకోమనిషి చిరునవ్వు ముఖంతో కారాకిళ్ళీ నములుతూ చూస్తున్నాడు.

రాజా భయంగా 'ఎవరు కావాలిబాబూ' అని అడిగేడు. ఖాకీనిక్కరు మనుషుల్ని చూస్తుంటే చెవుల్లో గింగుర్లెత్తే శబ్దాలూ, వంటినొప్పులూ జ్ఞాపకం వస్తున్నాయి అతనికి. విలను లాంటాయన చాపమీద కూర్చున్నాడు. కారాకిళ్ళీ మనిషి పక్కనే ఆసీనుడయ్యాడు. విలను ఈ విధంగా చెప్పేడు—

'రాజారావూ నువ్వు మంచోడివి, అందుకని బతికి బయటపడ్డావు. అయ్యాళ ఎదవసన్నాసులు మరీవితక్కొట్టేశారు. ఆడేమో చచ్చాడు. అది కాస్తా ఈళ్ళ ప్రాణంమీదకొచ్చిపడింది. ఇద్దరు దొరికేపోయారప్పుడే. ఇక ఈళ్ళగోల. ఈళ్ళని రచ్చించాల్సింది నేను, నన్ను రచ్చించాల్సింది నువ్వు' పెద్ద జోకు వేసినట్టు నవ్వేడు

'నాకేం తెలీటం లేదు బాబూ' అన్నాడు రాజా అయోమయంగా.

'ఏంలేదు. ఇందులో అర్థం కానిదేంటి, పోలీసోళ్ళు నక్కల్లాగా కాచుక్కూర్చున్నారు నీకోసం, ఎప్పుడు ఆస్పటలు నుంచొత్తావా అని. కేసంతా నీమీదే వుంది. నువ్వు పిచ్చమాటలు మాటాడకుంటా ఒప్పుకుంటే నిన్ని ప్లీడరుగారి కప్పగిస్తాను. ఇహ ఆయనే ఇత్తాడు ఆ ట్రైనింగూ—అదీ. ఆయన చెప్పిందల్లా ఇను. ఆయన చెప్పినట్టే జెప్పాలి కోర్టులో. మమ్మల్ని ఆపదలో ఆదుకున్నావా, రాజారావూ, నీ కష్టం మేముంచుకోం.' అని పక్క జేబులోంచి ఓ నోట్ల కట్టతీసి రాజాముందు పడేశాడు. తేలిగ్గ పనయిపోయినట్టు పెద్ద లంకపొగాకు చుట్టతీసి వెలిగించి అతనికేసి చూసేడు.

రాజా 'ప్లీడరుబాబు' కేసితిరిగి 'నేనేం చేయాలో తెలవటంలేదు బాబుగారూ' అన్నాడు. ప్లీడరు బాబుగారు విచిత్రంగా నవ్వి చెప్పేడు. 'అంతా నీకే తెలుస్తుంది. నువ్వు వూఁ అంటే చాలు నీకిక రాజభోగమే — నువ్వు చేయాల్సిందాంట్లో కష్టం కూడా లేదు మిమ్మల్నెలా కొట్టేరో ఎక్కడ కొట్టేరో అన్నీ అడుగుతారు కోర్టులో. అన్నీ చెప్పేయచ్చు వున్నదున్నట్టుగా. కాని ముఖ్యమైన పాయింటొకటే వుంది. కొట్టినవాళ్ళని గుర్తుపట్టగలవా అంటారు. అవునంటావు. ఇద్దరిని చూపిస్తారు నీకు. ఆ వాళ రాత్రి మిమ్మల్ని కొట్టినవాళ్ళు వాళ్ళిద్దరూ కాదనీ, అసలోళ్ళకీ వీళ్ళకీ తేడా వుందనీ చెప్పాలి. అంతే ఇంకేం లేదు. ముందుముందు అంతా నే చెప్తానుగా నీకెందుకు. నువ్వు ముందు ఆయనకి సమాధానం చెప్పుమరి' ఆయన ధీమాగా మాటాడేడు.

'మమ్మల్ని కొట్టినాళ్ళు ఆళ్ళుకాదని చెప్పాలా ?'

'ఒరేయి రాజా', విలను సంబోధన శృతిమించింది. 'ఆళ్ళకిమాత్రం చంపాలనుందేమిటి మిమ్మల్ని. నాలుగు తగిలేతే జోలికి రాడని బెదరేద్దామనుకున్నారు. ఆడు కాస్తా చచ్చూరుకొన్నాడు. ఆడికేముందిలే, తెలివితక్కువ ఎదవ. తిక్కపని చేసు



బోయేడు అనుభవించేడు. నువ్వు అదే తేలిగ్గా మాట్లాడతావేంటి? నీకొచ్చే డబ్బు జూసుకో. నీ పేకాలూ వుద్యోగం జూసుకో. ఆ సినిమా హాల్లోనేగా నువ్వుండేది. నాకాడు తెలుసులే. మనమెంత జెప్తే అంత. అయినా కాని ఆళ్ళకి శిక్ష ఏయించినా చచ్చినోడు తిరుగొస్తాడేరా? నాకు తెలీకడుగుతా. ఏదో అలా జరిగిపోయిందంతే. ఏం జేస్తాం దానికి' ఆయన వేదాంతం కూడా మాట్లాడుతున్నాడు. ఆయన మాటలు వింటూంటే రాజాకి, ప్రెసాదు ప్రాణాలు ఎత్తుకుపోయిన రాత్రి, వాళ్ళిద్దరూ బాధతో కొంకర్లు తిరిగిపోయిన క్షణాలూ జ్ఞాపకం వచ్చాయి. ఆ అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోవటం కూడా దురాశే అవుతుందా?

అతని హృదయం బాధగా మూలిగింది. హృదయంలో ఏ పొరల్లో ఎక్కడో 'ప్రాణ మిత్రులం' అనే మాట వినిపిస్తోంది. (ప్రెసాదుగాడి నవ్వుముఖం కళ్ళు మూసుకోకపోయినా కనిపిస్తోంది.)

కాని...నల్లటినీడలు...వాటి చేతుల్లో ఇనపచువ్వలు. అవి తనని వదలవు. వేటాడుతాయి. వెంటాడి పగతీర్చుకుంటాయి ...

చింకిచాపమీద ఇంకో నోట్లకట్ట పడింది. వాటి వెనక నీడలనీడ కూడా పడని జీవితం తళుక్కుమని మెరిసింది. పొట్టి నిక్కర్ల మనుషులు కోపంగా ఆత్రంగా చూస్తున్నారు. విలను చుట్ట నోట్లో బిగించి సాలోచనగా చూస్తున్నాడు. ప్లీడరు బాబు మోకాళ్ళమీద చేతులేసి కుర్చీని గోడల్ని పరిశీలిస్తున్నాడు. 'లాభం లేదు వీడూ ఆడిలాటోడే' అన్నాడు విలను మనసులో తను అనుకుంటున్నట్లు.

కాసేపు ఆ గదిలో గాలినిండా మెత్తటి క్రూరత్వం నిండిపోయింది.

రాజాకి హఠాత్తుగా చాలా భయం వేసింది. ఆ నిశ్శబ్దం భరించలేనట్లుగా వుంది. ఆ [illegible] ఆలోచించటం మానేసి అందరి వంకా తిరిగి 'మీ యిష్టం బాబా' అన్నాడు ... బలవంతుడి ఆజ్ఞకి లొంగే బలహీనుడిలా.

* * *

[illegible] ఆ తలుపు చూసింది. ఆ [illegible] ఆ చిన్నగదిలో రాజ్యం చేసిన [illegible] ప్రశాంతత, మనసుల్లో రేగే [illegible] తుఫానులూ దానికి తెలిసేయి. [illegible] దానికి చీకటంటే భయం వేయలేదు.

ఇది జరిగిన ఆరునెలలకి మళ్ళీ ఓరోజు సాయంత్రం అయింది. సూర్యుడు అలవాటు ప్రకారం అస్తమించేముందు జేగురు రంగు కిరణాలు ప్రసరింపజేస్తున్నాడు. గోడపక్క మురికి కాలవలో రెండు పెద్దసైజు పందులు విశ్రాంతి తీసుకుంటున్నాయి. పెద్దింటిగోడలు రెండూ గర్వంగా నిటారుగా నిలబడివున్నాయి. తాళం వేసున్న తలుపు ఒంటికాలుమీద తపస్సుచేసే ముని లాగా వుంది.

ఆ సమయాన సందుచివర ఓ చిన్న సంచి పట్టుకుని నడుచుకుంటూ ఓ వ్యక్తి వచ్చేడు. అతని గడ్డం మాసిలేదు. కళ్ళు లోతుకు పోలేదు. శుభ్రమైన పాంటూ చొక్కా వేసుకున్నాడు. తిండికి లోటులేనివాడిలా ఆరోగ్యంగా వున్నాడు. సందు మొగన ఎవరో పలకరించేరు. అతను చెప్తున్నాడు 'అవును కేసు కొట్టేశారు ఆళ్ళిద్దరినీ వదిలేస్తున్నారు' 'మరే. అసలు వాళ్ళు దొరకటం మాటలేంటి! ఈపోలీసోళ్ళు పుసుక్కున పాత కేడీల్ని లాక్కొచ్చేస్తారు ప్రతిదానికీ...' అనేసి పలకరించిన పాటి గేటుకీపరు వెళ్ళిపోయేడు.

ఆ వ్యక్తి—రాజా అనే పేరుగల పక్క పాపిడితీసి దువ్వే అబ్బాయి అలవాటైన సందులో నడుస్తూ వచ్చేడు. తలుపు తాళం తీసి లోపలికెళ్ళేడు. చీకటిగావుంది. బుడ్డి దీపం వెలిగించాడు. గది మధ్యగా చింకిచాప కనబడింది. అక్కడే ప్రెసాదు ఓరాత్రంతా చచ్చిపడున్నాడు. హాస్పటల్నుంచి వచ్చిన రోజు జ్ఞాపకం వచ్చింది. కాని ఇవాళ ఎవరూ తన గదికి రారు. సాక్ష్యం చెప్పటానికి ట్రైయినింగు ఇవ్వరు. అటు ప్రసాదు కూడా వెళ్ళిపోయేడు. ఈరోజు తను ఒంటరివాడయిపోయేడు.

బాగా చీకటిపడింది. దీపం మిణుకుమంటూ వెలుగుతూంది. రాజా ఆలోచిస్తూ పచార్లు చేస్తున్నాడు. జీవితంగురించి ఆలోచిస్తున్నాడు. ఇకముందు ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాడు. తను అర్థం చేసికోలేకపోయిన ప్రెసాదు ప్రేమనిగురించి ఆలోచిస్తున్నాడు. ఆలోచిస్తూ నడుస్తున్నవాడల్లా హఠాత్తుగా ఆగిపోయేడు.

తలుపు. తలుపు పైభాగాన శ్రీరామ అని సుద్దముక్కతో రాసిన అక్షరాలున్నాయి. ప్రెసాదుగాడు రాసేడుగదిలో కొత్తగా జేరినపుడు. నిద్రలేవగానే ఆ శ్రీరామ కనబడాలిట! రాజాచూపులు పైనుంచి క్రిందకి వచ్చాయి. అక్కడ గయోపాఖ్యానం డ్రామా కాగితం అంటించివుంది. సంవత్సరం పైనవుతుందేమో ఆ డ్రామాచూసి, అనుకున్నాడు. దానిపక్కన అతికించివున్న ఇంకో బొమ్మదగ్గర అతని చూపులు ఆగిపోయాయి. 'ప్రాణమిత్రులు'లో నాగేశ్వరరావు, జగ్గయ్య నటించిన దృశ్యం, అని కింద రాసుంది. ఆబొమ్మ చాలా పాతబడిపోయింది. రాజా దానిదగ్గరకెళ్ళి చూస్తూ నిల్చుండిపోయేడు చాలాసేపు.

తరువాత కాసేపటికి రాజా హఠాత్తుగా ఆ చింకిచాపమీదపడి భోరున ఏడ్చేడు, హృదయంలో బరువంతా తీరిపోయేట్లు. పశ్చాత్తాపం లాంటి భావం ఏదో హృదయాన్ని కాలుస్తూంటే బెంగగా బాధగా దిగులుగా ఒంటరిగా ఆగది మధ్యని పడి బిగ్గరగా రోదించేడు. పాతబడి చిల్లులు పడిన తలుపూ, మాసిపోయి బూజుపట్టిన గోడలూ, అవన్నీ అతను ఏడుస్తోంటే నిర్లిప్తంగా చూసేయి.

ఓ గంటసేపు ఏడ్చి అలసిపోయిన రాజా గభాలున లేచి ఓ పక్కన పడివున్న పాతరేకుపెట్టెలో బట్టలన్నీ సర్దేశాడు. బట్టల అడుగున రెండు కొత్తనోట్లకట్టలు తడిమి చూసేడు. తరవాత పెట్టె మూసేసి, ముఖం తుడుచుకొని, దీపం ఆర్పేసి గదిని చీకటి చేసేసి తెల్లబోయి చూసి తలుపుని తాళం వేయకుండా చీకట్లో వదిలేసి చకచకా అడుగులేసుకుంటూ ఆ సందులోంచి బయటికి వెళ్ళిపోయాడు.

నిర్ఘాంతపోయిన గోడలు చీకట్లో, కాసేపటికి తేరుకుని నిశ్శబ్దాన్ని పలకరించాయి!

కాని అప్పట్నుంచి ఆ తలుపుకి మాత్రం చీకటంటే, భయం పట్టుకుంది. ఆక్షణం నుంచి చీకట్లో దానికి భయంగా వింతగా ఎన్నో సంఘటనలు పుంఖాను పుంఖంగా జ్ఞాపకం వస్తున్నాయి. ఆ జ్ఞాపకాలు వికృతంగా నృత్యం చేస్తే — బెదరిపోయిన పాత తలుపు ముసలి తత్త్వవేత్తలా చీకటికేసీ, అప్పుడప్పుడూ మెరిసే నక్షత్రాలకేసీ, వీధిదీపం గుడ్డి వెలుతురులోకీ చూస్తూ ఆలోచిస్తూ వుంటుంది.